కొత్త ఆలోచనలకు పదును పెట్టాలి

కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్



జ్ఞాపికను అందిస్తున్న కమలేష్ పటేల్

నందిగామ, ఫిబ్రవరి16: స్వయం సమృద్ధి ప్రపంచం కోసం యువకులు పరిశోధనలు చేస్తూ కొత్త ఆలోచనలకు పదును పెట్టాలని కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్ సూచించారు. నందిగామ మండలపరిధి లోని కన్హాశాంతివనంలో ఆదివారం సస్టైనబిలిటీ ఇన్ క్లాస్‌రూమ్ కార్యక్రమాన్ని గురూజీ కమలేష్ పటేల్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సహకారంతో చేపడుతున్న కార్యక్రమాలు యువత, విద్యార్థులకు కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టడానికి మంచి అవకాశమన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ ద్వారా విద్యలో పురోగతి, పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు ప్రపంచానికి ఎంతో ఉపయోగకరమన్నారు. సామరస్యం, జ్ఞానం కన్హాశాంతివనంలో బోధించడంతో పాటు జీవించబడుతున్నాయన్నారు. యువత శక్తి, సృజనాత్మకత, సంకల్పం, నాయకత్వ లక్షణాలు నెరవేర్చడానికి ఇక్కడ ప్రోత్సాహం లభిస్తుందన్నారు. హార్ట్‌ఫుల్‌సెంటర్‌ను సందర్శించినప్పుడు ప్రకృతిని తాకిన అనుభూతి పొందానని తెలిపారు. గురూజీ కమలేష్‌పటేల్ మాట్లాడుతూ తాము చేస్తున్న కార్యక్రమాలకు ప్రభుత్వం సహకారం అందించడం చాలా సంతోషకరమన్నారు. అంతకు ముందు గురూజీతో కలిసి ప్యాట్రిసియా స్కాట్లాండ్ ధ్యానమందిరంలో 15 నిమిషాల పాటు ధ్యానం చేశారు. గురూజీ ఆమెకు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రమిషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తేలిన లెక్క!



- 21 మండలాల్లో 1,358 పోలింగ్ కేంద్రాల ఖరారు
- జిల్లాలో గ్రామీణ ఓటర్లు 7,63,603 మంది
- తుది జాబితా విడుదల చేసిన కలెక్టర్
- 232 ఎంపీటీసీ, 21 జెడ్పీటీసీ స్థానాలు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల సంఖ్య తేలింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల సంఖ్య, పోలింగ్ కేంద్రాలు, తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాను జెడ్పీ కార్యాలయం, కలెక్టరేట్‌లో నోటీసు బోర్డుపై ప్రదర్శించారు. జిల్లాలో 21 మండలాల్లో 232 ఎంపీటీసీ, 21 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నట్లు, 1358 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జాబితాలో పొందుపర్చారు. అలాగే 21 మండలాల్లో 7,63,603 మంది ఓటర్లు ఉన్నట్లు తేల్చారు. జిల్లాలోని మండల ప్రాదేశిక నియోజకవర్గాల్లో అత్యధిక ఓటర్లు యాచారం మండలంలో ఉన్నారు. ఈ మండలంలో ఎనిమిది మంది ఎంపీటీసీ స్థానాల్లో 61 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 51,546 మంది ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా ఆమనగల్లులో 14,709 మంది ఓటర్లు ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని జిల్లా స్థాయి అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ ఆదేశించారు. దీంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ప్రక్రియపై స్పష్టత రావాల్సి ఉంది.

తగ్గిన ఎంపీటీసీ స్థానాలు

జిల్లాలో 257 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వీటిలో 25 స్థానాలు మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. ఔటర్ చుట్టూ ఉన్న గ్రామాలను మున్సిపాలిటీల్లో చేర్చడంతో ప్రస్తుతం వీటి సంఖ్య 232కు చేరింది. ఆయా మండలాలు మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందుతుండటంతో ఎంపీటీసీ స్థానాల సంఖ్య తగ్గుతూ వస్తుంది. జిల్లాలో ఎనిమిది శాసనసభ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 27 మండలాలు ఉండగా.. వీటిలో హయత్‌నగర్, సరూర్‌నగర్, బాలాపూర్, గండిపేట్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి మండలాలను పూర్తిగా అర్బన్ మండలాలుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ అర్బన్ మండలాలన్నీ జీహెచ్ఎంపీ పరిధిలో భాగంగానే ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం 21 గ్రామీణ మండలాలున్నాయి. వీటిలో 21 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఎంపీటీసీల లెక్క తేల్చడంతో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 232కు చేరుకుంది.

ఎంపీటీసీ స్థానాలు, పీఎస్‌లు, ఓటర్ల వివరాలు

మండలం	ఎంపీటీసీలు	పీఎస్‌లు	ఓటర్లు
అబ్దుల్లాపూర్‌మెట్	08	61	36,607
ఆమనగల్లు	05	23	14,709
చేవెళ్ల	12	72	40,528
జిల్లేడు చౌదరిగూడ	09	45	25,671
ఫరూఖ్‌నగర్	17	89	51,546
ఇబ్రహీంపట్నం	10	58	31,662
కందుకూరు	16	92	52,326
కడ్తాల్	10	60	34,546
కేశంపేట	12	61	36,855
కొందుర్గు	08	43	23,760
కొత్తూరు	06	31	16,713
మాడ్గుల	14	85	45,030
మంచాల	13	75	40,847
మొయినాబాద్	09	57	31,056
మహేశ్వరం	13	79	44,473
నందిగామ	09	48	27,692
షాబాద్	15	88	49,689
శంకర్‌పల్లి	11	70	37,565
శంషాబాద్	09	61	33,568
తలకొండపల్లి	12	66	37,785
యాచారం	14	94	50,975

రోడ్లకు మరమ్మతులు చేపట్టే వరకు

పోరాటం ఆపేదిలేదు

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య



పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

మంచాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టే వరకు పోరాటం ఆపేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో చెన్నారెడ్డిగూడ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెన్నారెడ్డిగూడ నుంచి ఆరుట్ల వరకు, చెన్నారెడ్డిగూడ నుంచి బోడకొండ వరకు డబుల్ బీటీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఈ రోడ్లను ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు. బండలేమూరు, అజ్జనాతండా గ్రామాల రోడ్లు పూర్తిగా పాడయ్యాయన్నారు. కేవలం ఇక్కడ సీపీఎం ప్రాబల్యముందనే కారణంతోనే రోడ్లను బాగు చేయడం లేదన్నారు. రోడ్లకు మరమ్మతులు చేస్తున్నామని శిలాఫలకం వేసి చేతులు దులుపుకోవడమే సరిపోయిందన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు, ఎంపీడీవోలు స్పందించి రోడ్లుబాగు చేయకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.స్వామి, బి.పాండు, ప్రహ్లాద్, ప్రభాకర్, యాదయ్య, పరమేష్, ఇబ్రహీం, మధు, మీనా, బిక్షపతి, వెంకటేష్ తదితరులున్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



జేసీబీ సాయంతో ట్రాక్టర్‌లో మట్టిని నింపుతున్న వ్యాపారులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండలంలో అక్రమ మట్టి దందా జోరుగా సాగుతోంది. పగలూ రాత్రి అనే తేడా లేకుండా వ్యాపారులు ప్రభుత్వ భూములు, గుట్టల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. కొందుర్గు మండలం చిన్న ఉమ్మెంత్యాల గ్రామ శివారులోని సర్వే నంబరు 63లో (3-28 గుంటల) ప్రభుత్వ భూమిని తవ్వి మట్టిని తరలిస్తున్నారనే సమాచారం కొందుర్గు మండల ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఆనంద్ తెలుసుకున్నారు. ఆ మేరకు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. విషయమై కొందుర్గు మండల తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎస్ఐ రవీందర్ నాయక్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా ఫోన్ ఎత్తలేదు.

ప్రమాదకరంగా కల్వర్టు



యాచారం పోలీస్ స్టేషన్ పక్కన ప్రమాదకరంగా కల్వర్టు

యాచారం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పక్కన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఇటుకల లోడ్‌తో వెళుతున్న లారీ ముందున్న కారును తప్పించబోయి కల్వర్టు వైపు దూసుకుపోయి పల్టీ కొట్టింది. దాంతో కల్వర్టు ధ్వంసమైంది. నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఈ కల్వర్టు శిథిలమవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈ, ఏఈలను ఫోన్‌లో సంప్రదించగా వారు అందుబాటులోకి రాలేదు.

వైభవంగా తెప్పోత్సవం

- సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో అట్టహాసంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- మూడువేల మంది విద్యార్థులతో నాట్య ప్రదర్శన

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో జరుగుతున్న సమతాకుంభ్ తృతీయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో రాష్ట్రంలోని వివిధ పాఠశాలకు చెందిన మూడు వేల మంది విద్యార్థులు ఘంటసాల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో మహా నాట్య ప్రదర్శన చేశారు. దీనికి ఇండియన్ వరల్డ్ రికార్డు, వండర్ బుక్ ఆఫ్ రికార్డు, నృత్య గోల్డెన్ స్టార్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వంటి నాలుగు రికార్డులు వచ్చాయని నిర్వాహకులు తెలిపారు. చిన్నారులకు స్వామిజీ మంగళశాసనములు అందజేశారు. సనాతన ధర్మాన్ని, సంప్రదాయాలను పాటిస్తున్న చిన్నారుల తల్లిదండ్రులను చిన జీయర్‌స్వామి అభినందించారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్‌స్వామి, మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కోనేరులో వదిలిన బ్రహ్మకమలం



నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

చికెన్ సేల్స్ ఢమాల్!

బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో పడిపోయిన అమ్మకాలు

- కొనుగోలుకు వెనుకడుగు వేస్తున్న ప్రజలు
- ధరలు తగ్గించినా కొనేవారు కరువు
- పెరిగిన చేపలు, మటన్ విక్రయాలు
- డిమాండ్ కారణంగా ధరలు పెంచిన వ్యాపారులు





యాచారం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా బర్డ్‌ఫ్లూ వైరస్ సోకి కోళ్లు చనిపోతున్నాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో చికెన్ అమ్మకాలు అమాంతం పడిపోయాయి. ఎందుకొచ్చిన గోల అని చికెన్ కొనడం ప్రజలు మానేశారు. దీంతో చికెన్ దుకాణాలు వెలవెలబోతున్నాయి. ఎక్కువగా మటన్, చేపలు కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం పలుచోట్ల చేపలు, మటన్ దుకాణాలు కిటకిటలాడాయి.

అమ్మకాల్లేవ్..

చిన్నపాటి దుకాణంలో రోజుకూ 15నుంచి 30 కిలోల చికెన్ విక్రయించే వాళ్లమని వ్యాపారాలు చెబుతున్నారు. దీనిద్వారా రూ.1000నుంచి రూ.1500 ఆదాయం ఉండేదని తెలిపారు. ప్రస్తుతం వైరస్ ప్రచారంతో రోజంతా నాలుగైదు కిలోలకు మించి చికెన్ అమ్మకాలు జరగడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. ఆదివారం వస్తే 50 నుంచి 80 కిలోల వరకు చికెన్ అమ్ముడయ్యేది. ధరలు తగ్గించినా కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదంటున్నారు. ఇంతకుముందు కిలో చికెన్ ధర రూ.245 . ఉండేది. ప్రస్తుతం రూ.95కి పడిపోయింది.

మటన్ ధర రూ.100 పెంచేశారు

బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో చికెన్ అమ్మకాలు తగ్గి మటన్ కొనుగోళ్లు పెరిగాయి. ఇదే అదనుగా భావించి వ్యాపారులు మటన్ ధరను

మిగతా 8వ పేజీలో...

ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట

33 అవార్డులు అందుకున్న క్లబ్ బృందం

ఆమనగల్లు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట పండింది. రీజియన్ పరిధిలోని క్లబ్‌లలో ఆమనగల్లు క్లబ్ అత్యుత్తమ క్లబ్‌గా ఎంపికైంది. గ్రామీణ క్లబ్‌లలో రాష్ట్ర స్థాయిలో సేవా కార్యక్రమాలలో ప్రశంసలందుకుంది. 2024-2025 సంవత్సరానికి చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా 33 అవార్డులు ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు లభించాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన లయన్స్‌క్లబ్ రీజియన్ మీట్‌లో రీజియన్ చైర్మన్ డాక్టర్ తెప్ప శ్రీను అవార్డులను ప్రదానం చేశారు. అత్యుత్తమ క్లబ్‌తో పాటు రీజియన్ పరిధిలో అత్యుత్తమ అధ్యక్షునిగా పసుల లక్ష్మారెడ్డి, ఉత్తమ కార్యదర్శిగా దోనాదుల మహేశ్, ఉత్తమ కోశాధికారిగా గుజ్జరి నర్సింహ్మ, ఉత్తమ పీఆర్వోగా ఎంపపాష అవార్డులు అందుకున్నారు. అదేవిధంగా రక్తదాన, కంటి వైద్య, ఉచిత మెగా వైద్య, మధుమేహ శిబిరాలు, పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం, మీల్స్‌అండ్ వీల్స్ అన్నదాన కార్యక్రమం, పాఠశాలలో తాగునీటి వసతి కల్పన, పేద విద్యార్థులకు చేయూత, పర్మినెంట్ ప్రాజెక్టులకు అవార్డులు లభించినట్లు పీఆర్వో పాష తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ బృందాన్ని లయన్స్‌క్లబ్ రాష్ట్రస్థాయి ప్రతినిధులు, రీజియన్ చైర్మన్ సత్కరించి అభినందించారు. సేవలను మరింతగా విస్తృతపర్చాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్లు సందడి నరేందర్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి, జూలూరి రమేశ్, రాధాకృష్ణ, రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి, జోన్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, జిల్లా చైర్మన్‌లు కసిరెడ్డి రాంరెడ్డి, జూలూరి రమేశ్, బండెల రామచంద్రారెడ్డి, కర్నాటి కొండల్ రెడ్డి, మిట్టపల్లి అంజయ్య, సునంద,అర్థం మనోహర్, వీరబొమ్మ బిక్షపతి, చంద్రశేఖర్ ఉన్నారు.



అవార్డులతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ బృందం

పేదోడి ఫ్రిడ్జికి భలే డిమాండ్

ఆమనగల్లు , ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భానుడు భగ్గుమంటున్న నేపథ్యంలో పేదోడి ఫ్రిడ్జిగా పేరొందిన మట్టికుండల విక్రయాలు జోరందుకున్నాయి. ఫిబ్రవరి నెలలోనే పగటి ఉష్ణోగ్రతలు అధికమయ్యాయి. ఎండలకు ప్రజలు అల్లాడుతున్నారు. దాహార్తిని తీర్చుకోవడానికి చల్లని నీటి కోసం మట్టి కుండలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆమనగల్లులోని ప్రధాన రహదారి పక్కన వీటిని అమ్ముతున్నారు. కుండ సైజును బట్టి రూ.150 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు.



అనురాగ్‌లో మెక్స్‌ఫ్లోరర్ పోటీలు

ప్రతిభ చూపిన జట్లకు బహుమతులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం, స్టూడెంట్ చాప్టర్, గేర్‌హెడ్ మోటార్స్ ఆధ్వర్యంలో ఆదివారం మెక్స్‌ఫ్లోరర్ పోటీలు నిర్వహించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) స్టూడెంట్, గేర్ హెడ్ మోటార్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 30 జట్లు పాల్గొన్నాయి. ఉత్తమ ప్రదర్శన చేసిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ సికిందర్ బాబా, కృష్ణయ్య, వధన్‌మోహన్‌రెడ్డి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



పూజా కార్యక్రమాల్లో ఎంపీ అరుణ

దౌల్తాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకేఅరుణ తెలిపారు. మండలంలోని గోకఫస్లాబాద్‌లో ఆదివారం నిర్వహించిన శివాలయం పున ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి, సతీశ్ ముదిరాజ్, కోటకొండ రాము, అశోక్, బుగ్గప్ప, వెంకటప్ప, నర్సింహారెడ్డి, రాములు, వెంకటేశ్, సత్యప్ప తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ విష్ణుదేవ్ శర్మతో ట్రోఫీలు అందుకున్న కులకచర్ల శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ

కులకచర్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ లెవల్ అబాకస్ పోటీల్లో కులకచర్ల మండల కేంద్రంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. జనవరిలో గ్లోబల్ లెవల్ అబాకస్ పరీక్షలు పాఠశాలలో నిర్వహించగా 53 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు గవర్నర్ విష్ణుదేవ్ శర్మ ట్రోఫీలు అందించారు. కార్యక్రమంలో విద్యాశాఖ కమిషనర్ వెంకట నర్సింహారెడ్డి, ఎస్సీ ఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డి, స్మార్ట్ జీనియస్ చైర్మన్ దేవిక, శ్రీకృష్ణవేణి స్కూల్ డైరెక్టర్ సౌమ్యరెడ్డి, ప్రిన్సిపాల్ అర్చన, కరస్పాండెంట్ విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో మరో విద్యార్థి

పరిగి : గ్లోబల్ లెవల్ అబాకస్ పోటీల్లో రోమహర్షన్ ముదిరాజ్ ఉత్తమ ప్రతిభ చాటారు. చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామానికి చెందిన అతను కేటీఎస్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం రవీంద్రభారతీ జరిగిన అబాకస్ పోటీల్లో సత్తా కనబరిచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు. పాఠశాల యజమాన్యం, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు తదితరులు అభినందించారు.

కల్యాణం కమనీయం

ఆమనగల్లు , ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని అయ్యప్ప కొండపైగల అయ్యప్ప స్వామి దేవాలయ ఆవరణలోని భవాని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ తృతీయ వార్షికోత్సవాల నేపథ్యంలో నిర్వహించిన కల్యాణానికి భక్తులు, మహిళలు, శివస్వాములు భారీగా తరలివచ్చారు. అర్చకులు మల్లికార్జున స్వామి, చంద్రశేఖర్, మహేశ్, శివకుమార్, అక్షయ్‌కుమార్‌లు మేళతాళాల మధ్య స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమానికి రామదూత ఆశ్రమ పీఠాధిపతి గురు సిద్ధమణికంఠ శివాచార్య మహాస్వామి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భక్తులకు అన్నదానం గావించారు. కార్యక్రమంలో గురుస్వాములు గాజుల పుల్లయ్య, యాదగిరి, నాగిళ్ల శ్రీను, దుర్గాప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, రాజశేఖర్, అమర్, సేవరాజ్, శివ, గణేశ్, గోపాల్, శేఖర్, వెంకట్, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

రోలర్ స్కేటింగ్‌లో సత్తా

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ది ఇంటర్ నేషనల్ స్కూల్‌లో జరిగిన రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో కాచవానిసింగారం నిహాక్ ఇంటర్‌నేషనల్ స్కూల్ క్రీడాకారులు సత్తాచాటారు. ఈ టోర్నమెంట్‌లో 35 పాఠశాలల క్రీడాకారులు పాల్గొనగా నిహాక్ స్కూల్ విద్యార్థులు 12 పతకాలను సాధించారు. వీరిని డైరెక్టర్ టీ సవంత్‌రెడ్డి, కోచ్ మహేష్, ఉపాధ్యాయులు అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వారు కోరారు. క్రీడలతో ఉద్యోగ అవకాశాలు వస్తాయని డైరెక్టర్ తెలిపారు. పాఠశాలలో క్రీడాకారులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.


రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులు

రేపు ఆమనగల్లుకు కేటీఆర్

రైతుదీక్ష సభా ఏర్పాట్లు పరిశీలించిన పార్టీ శ్రేణులు


సభాస్థలిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, బాల్‌రాజ్

ఆమనగల్లు , ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని మాడ్గుల రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 18న నిర్వహిస్తున్న రైతుదీక్ష సభా స్థలి ఏర్పాట్లను ఆదివారం మాజీ మంత్రి చర్లకోలు లక్ష్మారెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాల్‌రాజ్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌లు పరిశీలించారు. దీక్ష సభ, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించి పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత, తిరుగుబాటు మొదలైందని అన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయక అన్ని వర్గాల ప్రజలను మోసగించిందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ ప్రజల పక్షాన ఎండగడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు


కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యేలు

వికారాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, మహేష్ రెడ్డిలు ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో 4 గంటలపాటు పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ నెల 19న తెలంగాణ భవన్‌లో జరిగే విస్తృత స్థాయి సమావేశం, పార్టీ సభ్యత్వం, త్వరలో నిర్వహించబోయే ప్లీనరీ సమావేశంపై కూడా డిస్కషన్ చేశారు. పరిగి, వికారాబాద్ నియోజకవర్గాల్లో కొత్త కమిటీల ఏర్పాటు, అనుసరించాల్సిన వ్యూహాలపై సమాలోచన చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజాదారణ పొందిన పథకాలను కాంగ్రెస్ నిలిపి వేయడంపై ఆందోళన వ్యక్తం చేయగా వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వస్తామని కేసీఆర్ దీమా వ్యక్తం చేశారని ఆనంద్ తెలిపారు.

త్వరలో బీసీ సేన

జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

తాండూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘంకు అనుబంధ సంస్థగా త్వరలో బీసీ సేన ఏర్పాటు చేయనున్నట్లు బీసీ జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూర్ రాజ్‌కుమార్ వెల్లడించారు. ప్రతీ గ్రామం నుంచి యువకులు చేర్చుకొని 100 మందితో కార్యవర్గం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆదివారం తాండూరు పట్టణం హిమాలయ్స్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అనుబంధ సంస్థగా బీసీ సేన కొనసాగుతుందని అన్నారు. వచ్చే మార్చిలో బీసీ సేన భారీ సభ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సేన అధ్యక్షుడు బర్క కృష్ణ హాజరవుతారని వెల్లడించారు. తాండూరు నియోజకవర్గ బీసీ సేన అడక్ కమిటీ కోఆర్డినేటర్‌గా ఆనంద్ బగాడేను ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సయ్యద్ శుకుర్, పెద్దేముల్ మండల యువజన అధ్యక్షుడు నవీన్, నియోజకవర్గ యువ నాయకులు రాంరెడ్డి, పరమేష్, కాంత్, మొగులప్ప, జగ్గు, నరేష్, వెంకట్, శ్రీశైలం, వివేక్, సయ్యద్ , లాల్ బాబా గౌడ్, రాజు, రఘు, మహేష్, నాని శేఖర్, వీరేష్‌వర్ధన్, మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ శైలజ బదిలీ



మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) మేడ్చల్ తహసీల్దార్ శైలజ నాగర్‌కర్నూల్‌కు బదిలీ అయ్యారు. ఆ మేరకు ఈ నెల 8న ఉత్తర్వులు కలెక్టర్ కార్యాలయానికి అందాయి.

అర్బన్ జిల్లాగా మేడ్చల్!

మేడ్చల్ జిల్లా ఇక పూర్తిగా అర్బన్‌గా మారనుంది. ఇప్పటికే చాలా గ్రామాలు మున్సిపాలిటీలుగా మారాయి. మరికొన్ని సమీప మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. దీంతో మిగిలిన కొద్దిపాటి గ్రామాలను కలుపుకొని మున్సిపాలిటీలుగా మార్చాలనే అధికార పార్టీ నేతలు చేసిన కృషి ఫలించింది. ఆయా గ్రామాలను అధికారులు సర్వే చేసి పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించారు. మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట, శామీర్‌పేట మండలంలోని అలియాబాద్‌తో పాటు మూడుచింతల పల్లి మండలంలోని అన్ని గ్రామాలను కలుపుతూ మరో మూడు మున్సిపాలిటీలను ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

- ఇక పంచాయతీలు, మండల పరిషత్‌లు లేనట్లే
- మరో మూడు మున్సిపాలిటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ఇప్పటికే సర్వే పూర్తి చేసిన అధికారులు
- కొత్తగా ఎల్లంపేట, అలాయాబాద్, మూడుచింతలపల్లి బల్దియాలు
- స్థానిక ఎన్నికలపై ఆశలు వదులుకున్న నేతలు



ఎల్లంపేట పంచాయతీ కార్యాలయం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజుల క్రితం ఓఆర్ఆర్‌కు అవతలి వైపు (నగరానికి అనుకుని) ఉన్న మున్సిపాలిటీల్లో కొన్ని పంచాయతీలనుగ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేసేందుకు ప్రభుత్వ నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. దీనికి తోడు కొన్ని పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో ఆయా మండలాల్లో గ్రామాల సంఖ్య బాగా తగ్గింది. దీంతో మేడ్చల్, శామీర్‌పేట మండలాల్లో నామమాత్రపు సంఖ్యలో పంచాయతీలు మిగిలిలాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్ యాదవ్‌లు జనవరి 17న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే. ఈ విషయంపై సీఎం స్పందించడంతో ఆయా గ్రామాల్లో అధికారులు సమగ్రంగా సర్వే నిర్వహించి మూడు మున్సిపాలిటీల ఏర్పాటుకు పభుత్వానికి సమగ్ర నివేదికను పంపినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తారా? లేక మున్సిపాలిటీలుగా మారుస్తారా? అనే విషయంపై ఉత్కంఠతతో ఎదురుచూస్తున్న స్థానిక నేతలకు కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు స్పష్టతను ఇచ్చింది.

ఈ గ్రామాలను కలుపుకొని..

మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట, డబిల్‌పూర్, ఘన్‌పూర్, కొనాయిపల్లి, లింగాపూర్, మైసిరెడ్డిపల్లి, నూతన్‌కల్, రాజబొల్లారం, రాజబొల్లారం తండా, రావల్‌కోల్, సైదనిగడ్డ తండా, సోమారం, శ్రీరంగవరం గ్రామాలను కలుపుతూ ఎల్లపేట మున్సిపాలిటీగా, శామీర్‌పేట మండలంలోని లాల్‌గడి మలక్‌పేట్, మజీత్‌పూర్, మురాహరిపల్లి, పొన్నాల, తుర్కపల్లి, యాడారం గ్రామాలను కలుపుతూ అలియాబాద్ మున్సిపాలిటీ, మూడుచింతలపల్లి మండలంలోని మొత్తం గ్రామాలను కలుపుతూ మరో మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇప్పటికే ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించినట్లు తెలుస్తోంది.

ఇక పంచాయతీలు లేనట్టే...

నియోజకవర్గంలోని కొత్తగా మూడు మున్సిపాలిటీలు అవతరించడంతో స్థానికంగా మండల , గ్రామ పంచాయతీల పాలన పూర్తిగా కనుమరుగు కానుంది. ఇప్పటికే మున్సిపాలిటీలుగా మారనున్న గ్రామాల్లో ఈ విషయం పట్ల స్థానికులు పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు. ఈ వ్యవహారం ముగ్గురు సీనియర్ కాంగ్రెస్ నేతల వద్ద ఉండటంతో వారు సైతం స్థానిక నేతలతో చర్చలు జరిపి కొన్ని మార్పులు చేర్పులు చేసే వీలు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మూడు మండలాల్లో ప్రభుత్వ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తుందని ఎదురుచూస్తున్న తరుణంలో గ్రామాలను మున్సిపాలిటీలుగా మరుస్తున్నారన్న విషయం తెలియడంతో నేతల ఆశలపై నీరు చల్లినట్లయింది. ఇప్పటికే మండల ప్రాదేశిక స్థానాలను అధికారులు ప్రకటించి వివరాలను మండల పరిషత్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డులపై ఏర్పాటు చేశారు.


జాఫర్‌ను సన్మానిస్తున్న సిరాజుద్దీన్

ఆర్‌టీఐ జిల్లా సభ్యుడు జాఫర్‌కు సన్మానం

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా ఆర్‌టీఐ సభ్యుడిగా ఎన్నికైన ఎర్రవల్లి జాఫర్‌ను ఆదివారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన సేవలను గుర్తించి ఆర్‌టీఐ సభ్యుడిగా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతీ కార్యకర్త కష్టంతో కాకుండా ఇష్టంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఎస్సీ కన్వీనర్ సోమారపు రవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చంద్రయ్య, ఏజాజ్‌పాష తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహోత్సవాలకు తరలిరండి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సురేందర్‌నాయక్, శాంతాదేవి

పెద్దేముల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సంత్ సేవాలాల్ మహరాజ్ మహోత్సవాల వేడుకలకు అందరూ పెద్దఎత్తున తరలిరావాలని రమావత్ సురేందర్‌నాయక్, రమావత్ శాంతాదేవి కోరారు. మండలంలోని కందనెల్లితండా సమీపంలోని యాడీబాపుగడ్ దేవస్థాన్ ఆధ్యాత్మిక కేంద్రంలో ఈనెల 20న నిర్వహించే ఈ మహోత్సవాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఆ మేరకు గోడపత్రికను వారు ఆవిష్కరించారు. సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ కోసం బంజారా ధర్మ స్థాపన కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రతీ బంజారా తన కర్తవ్యంగా భావించాలన్నారు.

ఈతకెళ్లి ఇద్దరు యువకుల గల్లంతు

గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు

శామీర్‌పేట్ పీఎస్ పరిధిలో ఘటన


బాలు (ఫైల్)


సందీప్ సాగర్ (ఫైల్)

మూడుచింతల పల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జగద్గిరిగుట్టకు చెందిన పూమాల కొడుకు బాలు (25) ఉద్యోగం చేస్తున్నాడు. స్థానికంగా ఉండే తన స్నేహితులైన సందీప్‌సాగర్(27), సందీప్(26), సాయిచంద్(25), నాగారానికి చెందిన బాలకృష్ణ (24), నితీశ్ కుమార్ (24)లతో కలిసి అతను ఆదివారం పార్టీ చేసుకునేందుకు ప్లాన్ చేసుకున్నారు. శామీర్‌పేట్ మండలం పొన్నాల గ్రామానికి చేరుకున్న వీరు చిత్తారమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. కోడిని కోసి మొక్కు చెల్లించారు. అనంతరం వారి వెంట తెచ్చుకున్న మద్యాన్ని తాగారు. అనంతరం పక్కనున్న చెరువులో ఈత కొట్టేందుకు దిగారు. ఈ క్రమంలో లోపలికి జారీ బాలు, సందీప్‌సాగర్ నీట మునిగారు. విషయాన్ని తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ తెలియ రాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మోటార్లు బిగించేదెన్నడో?

నిరుపయోగంగా కొత్త బోర్లు

తాగునీటికి ఇబ్బందులు

ధారూరు, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): ధారూరులోని మిషన్ భగీరథ మంచినీటి ట్యాంకుల వద్ద వేసిన రెండు తాగునీటి బోర్లకు మోటార్‌లు బిగించకుండా జాప్యం చేస్తున్నారు. దీంతో ఇవి నిరుపయోగంగా మారాయి. ధారూరులోని పాత కమ్యూనిటీ హాల్ వద్ద, పీఏసీఎస్ కార్యాలయం సమీపంలో ఉన్న మిషన్ భగీరథ మంచినీటి ట్యాంకుల వద్ద 5 నెలల క్రితం రెండు బోర్లు డ్రిల్ చేశారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే రెండు ట్యాంకులలో నీళ్లు నింపి గ్రామానికి సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయంగా ఈ బోర్లు వేయించారు. వాటికి మోటార్లు బిగించకపోవటంతో అవి నిరుపయోగంగా మారాయి.. ఇవి బిగిస్తే గ్రామానికి తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని స్థానిక ప్రజలు అంటున్నారు. ఈవిషయమై కాంట్రాక్టర్ రేపు, మాపు అంటూ నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యాదర్శి అంజా నాయక్ దృష్టికి తీసుకెళ్లగా... వారంలో మోటార్‌లు బిగిస్తానని కాంట్రాక్టర్ చెప్పాడన్నారు. ఆయన జాప్యం చేయటం వల్లే సమస్య ఏర్పడిందన్నారు.


డ్రిల్ చేసిన బోర్

పెరిగిన 'తెల్లజొన్న' విస్తీర్ణం

ఆసక్తి చూపుతున్న రైతులు

మార్కెట్‌లో పంటకు డిమాండ్


సాగులో తెల్లజొన్న

బషీరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది తెల్లజొన్న పంట సాగు ఈ ఏడాది స్వల్పంగా పెరిగింది. గతంలో మండల వ్యాప్తంగా నాలుగు వేల ఎకరాలకు పైగా ప్రధాన పంటగా ఇక్కడి రైతులు సాగు చేసేవారు. గతేడాది యాసంగిలో 594 ఎకరాల్లో తెల్లజొన్న పంట సాగు చేయగా, ఈ ఏడాది స్వల్పంగా పెరిగి 664 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులు మళ్లీ సాగు వైపు ఆసక్తి చూపుతున్నారని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

నీటి ఆధారం లేకున్నా.....

మండలంలో అత్యధికంగా నల్లరేగడి భూములు తెల్లజొన్న పంట సాగుకు అనుకూలం. పర్వత్‌పల్లి, నీళ్లపల్లి, జలాల్‌పూర్, నవాల్గ, జీవన్గి, మైల్వార్, దామర్‌చెడ్, గొట్టిగఖుర్దు, కాశీంపూర్, మంతట్టి తదితర గ్రామాల్లో ఒకప్పుడూ ఇక్కడి రైతులు ప్రధాన పంట. యాసంగిలో శీతాకాల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పండుతుంది. తక్కువ పెట్టుబడి, ఎక్కువ దిగుబడి, తక్కువ నీరు.. చీడపీడల బెడద లేకపోవడంతో అప్పట్లో రైతులు అత్యధికంగా జొన్న సాగు చేసేవారు. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. మార్కెట్లో జొన్నల ధర తక్కువగా ఉంటుందని, కొన్నేళ్లుగా వాణిజ్య పంటల వైపు మొగ్గుచూపడంతో రానురానూ సాగు పూర్తిగా తగ్గిపోయింది. దీనికి తోడు అడవి పందుల బెడద అధికం కావడం కూడా పంట విస్తీర్ణం తగ్గటానికి మరో కారణంగా రైతులు చెబుతారు. ప్రస్తుతం చక్కెర (షుగర్) వ్యాధిగ్రస్తులు పెరుగుతుండటంతో తెల్లజొన్నలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది. కానీ రైతులు మాత్రం పత్తి, కంది, వరి పంటలను అత్యధికంగా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది క్వింటాల్ జొన్నలకు రూ.6వేల నుంచి రూ.7వేల వరకు ధర పలికే అవకాశం ఉందని వ్యాపారులు చర్చించుకుంటున్నారు.

మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

చేసిన పనులకు బిల్లులు రావడం లేదని మనస్తాపం

కాశీంపూర్‌లో ఘటన


వెంకటయ్య (ఫైల్)

బషీరాబాద్, ఫిబ్రవరి 16: (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా నాడు చేసిన పలు అభివృద్ధి పనులకు నేటికీ బిల్లులు రావడం లేదని మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాశీంపూర్‌లో ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సి.వెంకటయ్య సర్పంచ్‌గా ఉన్నప్పుడు పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టాడు. సుమారు రూ.6 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. పలుమార్లు బిల్లుల కోసం సంబంధిత అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయింది. దీంతో అప్పుల ఊబిలో కురుకుపోయిన ఆయన పలుమార్లు బిల్లులు రావడంలేదని మదనపడేవాడని అతడి కుటుంబ సభ్యులు, సన్నిహితులు వాపోయారు. ఈ క్రమంలోనే అప్పుల బాధ, ఒత్తిడితో ఆదివారం పొలానికి వెళ్లి వెంట తీసుకెళ్లిన పురుగుల మందు తాగుతూ తాను చనిపోతున్నానని గ్రామంలోని నర్సింహులు అనే వ్యక్తికి ఫోన్ చేశాడు. అతను వెంటనే వెంకటయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే పురుగుల మందు తాగిన వెంకటయ్య అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే అంబులెన్స్‌లో తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం వికారాబాద్ జిల్లా కేంద్రానికి తరలించారు. మిషన్ ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నాడు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారని కుటుంబ సభ్యులు రోధిస్తూ తెలిపారు.

ఘనంగా బోనాలు.. 'పట్నం' పూజలు


పూజల్లో చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రామంతాపూర్‌లో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ దేవాలయం వద్ద ఆదివారం బోనాలు ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద అమ్మ వారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, కల్యాణ వేడుకలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై వేడుకను తిలకించారు. ఈపూజా కార్యక్రమానికి శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులు ప్రతీ ఒక్కరిపై ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, శంకర్‌పల్లి సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహులు, న్యాయవాది ఉపేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ అశోక్, శంకర్‌పల్లి సొసైటీ మాజీ చైర్మన్ లింగారెడ్డి, గ్రామపెద్దలు చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాధయ్య, రాములు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ప్లాట్లు సాధించే వరకు పోరాటం


మాట్లాడుతున్న న్యాయవాది జుబేర్ అక్రం

ఘట్‌కేసర్ రూరల్; ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఏకశిల నగర్ ప్లాట్లు సాధించే వరకు యజమానులు సైనికుల్లా పోరాడాలని హైకోర్టు న్యాయవాది జుబేర్ అక్రం తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల ఏకశీలనగర్ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. న్యాయం తమవైపే ఉందన్నారు. ప్లాట్ల ఓనర్లు వాటిని సాధించేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారని అన్నారు. అలూరి వెంకటేష్ రాజకీయ ప్రోద్బలంతో ప్లాట్లను కబ్జా చేశాడని ఆరోపించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాల్‌రావు, ముత్తారెడ్డి, శివారెడ్డి, శ్రీనివాస్ చారి, ప్లాట్ల ఓనర్లు పాల్గొన్నారు.

ఎంపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

● మండల మహిళా బీజేపీ అధ్యక్షురాలు రాధిక

కేశంపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అమృత్ 2.0 పథకంలో భాగంగా నేడు (సోమవారం) షాద్‌నగర్ పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు బీజేపీ కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లాలని, ఎంపీ డీకే అరుణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని మండల మహిళా బీజేపీ అధ్యక్షురాలు రొల్లు రాధిక ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో దాదాపు రూ.28 కోట్ల చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ శంకుస్థాపన చేస్తారని, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు

● పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు
● శివనామస్మరణతో మార్మోగిన కొనగట్టు దేవాలయం


చేవెళ్ల : హోమం నిర్వహిస్తున్న దంపతులు

చేవెళ్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయం శివనామస్మరణతో మార్మోగింది. కొనగట్టు శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. మొదటిరోజు ఆలయం కమిటీ చైర్మన్ సున్నపు వసంతం, సున్నపు మాణిక్యప్రభుల ఆధ్వర్యంలో సభ్యులు, ప్రధాన అర్చకుడు సురేశ్‌లు మహాశివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే రాజరాజేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య పూజా కార్యక్రమలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమాల్లో దంపతులు కూర్చున్నారు. శ్రీ గణపతి పూజ, దీపారాధన, ధ్వజారోహణం, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, మహా మంగళహారతులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగిం ది. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ సభ్యులు జె.మల్లేశ్, రాంరెడ్డి, పర్మయ్య, యాలాల మహేశ్వర్‌రెడ్డి, శంకరయ్య, గోవర్ధన్‌రెడ్డి, ఆనంద్, ఎస్.మణిక్యప్రభు, దేవేందర్, సత్యనారాయణ, నాయకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


మైక్‌సెట్ బహూకరిస్తున్న మహేష్ దంపతులు

ఆలయానికి మైక్‌సెట్ వితరణ

కేశంపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాకునూర్ గ్రామంలో గల సీతా రామాంజనేయస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన దన్నే మహేష్ మైక్‌సెట్ వితరణ చేశారు. మహేష్ తన తండ్రి బీరప్ప జ్ఞాపకార్థం రూ.56వేలు ఖ ర్చుచేసి మైక్‌సెట్ కొనుగోలు చేశాడు. ఈ మేరకు ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మహేష్ దంపతులు పూజారి బొద రంగయ్యకు మైక్‌సెట్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా మహేష్ దంపతులను పూజారి అభినందించారు. కార్యక్రమంలో ఎదిరే మల్లేష్, హంసమ్మ, బోద లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

విద్యతోనే ప్రగతి

ఆమనగల్లు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ప్రగతి, సమాజంలో మార్పు, వ్యక్తి ఉన్నతి సాధ్యమని ప్రముఖ ముస్లిం మతగురువులు తయ్యబ్‌షా కరీంముల్లా హుస్సేని బందనవాజీ ఆల్ మారఫ్ కాసిక్ పాషా, హజ్రత్ అల్లామ, మౌలానా సయ్యద్ రాహూఫ్ అలీఖాద్రీలు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదవిద్యార్థులకు విద్యనందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు, విద్యావేత్తలు ముందుకు వచ్చి విద్యాసంస్థలు ఏర్పాటుచేయాలని వారు పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని బీఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం మదర్సా దారుల్ ఉలూం అన్వరే ముస్తాఫా 11వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మదర్సా ప్రిన్సిపాల్ మౌలానా అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మదర్సా విద్యార్థుల తల్లిదండ్రులు, ముస్లిం మైనార్టీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి తయ్యబ్ షా కరీంముల్లా హుస్సేని బందనవాజీ ఆల్ మారఫ్ కాసిక్ పాషా, హజ్రత్ అల్లామ, మౌలానా సయ్యద్ రాహూఫ్ అలీఖాద్రీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హఫీజే ఖురాన్ పూర్తి చేసుకున్న విద్యార్థులను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం మతగురువులు మాట్లాడుతూ సమాజశాంతి స్థాపనే అల్లా ధ్యేయమన్నారు. ప్రవక్త చూపిన మార్గం, చేసిన బోధన లు అందరికీ అనుసరణీయమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మదర్సా అధ్యక్షులు సయ్యద్ ఖలీల్, నా యబ్ సదర్ మహబూబ్, మదర్సా కమిటీ సభ్యులు, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మత గురువులు, ప్రశంసాపత్రాలతో మదర్సా విద్యార్థులు

అభివృద్ధిని మరిచిన సబితారెడ్డి

● బీఆర్ఎస్ నాయకుల మోసాలకు యువత బలి కావొద్దు
● కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రి, ప్రస్తుత మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మహేశ్వరం అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని తుమ్మలూరు మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రశాంత్‌రెడ్డిలు విమర్శించారు. ఆదివారం తుమ్మలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రిగా ఉండి కూడా తుమ్మలూరు రోడ్డు పనులను పూర్తి చేయలేని సబితాఇంద్రారెడ్డి.. కొందరు బీఆర్ఎస్ నాయకులతో రోడ్డు పనులు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ధర్నాలు చేయించడం సిగ్గుచేటన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసమే కొందరు బీఆర్ఎస్ నాయకులను ఉసిగొల్పి గ్రామ యువతతో ధర్నాలు చేయిస్తున్నారన్నారు. మరో వారంరోజుల్లో రోడ్డు పనులు ప్రారంభిస్తారన్న విషయాన్ని తెలుసుకున్న కొందరు బీఆర్ఎస్ నాయకులు తన గొప్పతనాన్ని చాటుకునేందుకు, కాంగ్రెస్‌కు చెడ్డపేరు తెచ్చేందుకే ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తన అనుచరులతో, యువతతో ధర్నాలు, నిరసనలు చేయిస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని ధర్నాలు చేయించినా తుమ్మలూరు రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. మంత్రిగా ఉండి చేయలేని పనులపై ఇప్పుడు ఎందుకింత ఆత్రుత, ఆందోళన అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు రోడ్డు పనులు చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్‌ను పనులు చేయొద్దని హుకుం జారీ చేశారని మండిపడ్డారు. ప్రజలను నమ్మించడానికి రోడ్డు పనులు చేయడం లేదని.. గ్రామ యువతను ప్రలోభాలకు గురిచేస్తూ ధర్నాలు చేసేలా ఉసిగొల్పుతున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న మోసాలకు తుమ్మలూరు యువత బలి కావద్దని, ధర్నాలు చేస్తూ లేనిపోని కేసుల్లో చిక్కి భవిష్యత్తును ఆగం చేసుకోవద్దని కోరారు. తుమ్మలూరు యువత నిజానిజాలను గమనించి గ్రామ అభివృద్ధికి సహకరించాలన్నారు. సమావేశంలో నాయకులు గంట నర్సిరెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

కందుకూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు ఉన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల్లో ఒకరైన సువర్ణ భర్త అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు ఆమెతో కలిసి చదువుకున్న అలనాటి విద్యార్థులు ఆదివారం రూ.58వేల ఆర్థికసాయం అందజేశారు. సువర్ణ మాట్లాడుతూ తన భర్త అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన స్నేహితులు ఆర్థిక సాయం అందజేయడం భరోసాగా ఉందన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న ప్రభాకర్ రెడ్డి తదితరులు

తలకొండపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పూలాబాయి అనారోగ్యంతో మృతిచెందింది. ఆదివారం మృతదేహాన్ని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభాకర్ రెడ్డి రూ.3వేలు, కాంగ్రెస్ నాయకులు మల్లేశ్, గణేశ్, నర్సింహులు రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని తెలిపారు. పరామర్శించిన వారిలో రమేశ్, రవీందర్ యాదవ్, అజీమ్, డిగ్రీ కృష్ణ, రామ్మోహన్ రెడ్డి, యాదగిరి, అంజయ్య, అమరేందర్, రమేశ్, శ్రీను, సురేశ్,మైసయ్య, శశి తదిరులు ఉన్నారు.



ముళ్ల కంపచెట్టు.. వాహనదారుల ఇక్కట్లు

మండలంలోని నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై తక్కళ్లపల్లి బ్రిడ్జికి ఆనుకొని ఓ ముళ్లకంప చెట్టు చాలా ప్రమాదకరంగా మారింది. యాచారం వైపు వెళ్లే చోట ముళ్లకంప చెట్టు ద్విచక్రవాహనాదారుల తలకు తగులుతోంది. ఇక్కడ అకస్మాత్తుగా బైక్ ఆపడంతో వెనకాల వేగంగా వస్తున్న మరో వాహనదారుడు ముందున్న వాహనాదారుడిని ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన ఇటీవల చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నం నుంచి మాల్ వ రకు ఆర్అండ్‌బీ రహదారిపై పలు చోట్ల రో డ్డుకు ఆనుకొని ముళ్ల కంపచెట్లుండడంతో త రచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయి తే, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు ఈ రహదారిని పట్టించుకోకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. తక్షణమే వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

యాచారం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి)

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


చేవెళ్ల : సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు


కందుకూరు : నేదునూరు ఉన్నత పాఠశాలలో..

చేవెళ్ల/కందుకూరు/మాడ్గుల, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 1955 నుంచి 2005 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఉదయం 9.45 గంటలకు జాతీయ గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలనాటి గురువులను పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఒకరినొకరు యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్వవిద్యార్థులు సంతోషంగా గడిపారు. స్వర్ణోత్సవ వేడుకల ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కందుకూరు మండలంలోని నేదునూరు ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని ఎంఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. అలనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు అంజిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గోవింద్‌సిలార్, సాయిబాబా, సరోజినిదేవి, నర్సింహ, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాడ్గుల మండలంలోని ఆర్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2021-22 బ్యాచ్ టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం నల్గొండ జిల్లా కుర్మేడ్‌లోని ఓ కన్వెన్షన్‌లో పూర్వపూవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. అలనాటి గురువులను సన్మానించారు. కరుణాకర్, జగన్, సైదులు, జి.శ్రీను, ఎం.శ్రీను, డి.శ్రీను, శ్రీరాములు, చందు, కల్పన, మహేశ్వరి, స్వప్న, జ్యోతి, శ్రీలత, ఉపాధ్యాయులు శంకర్, చంద్రయ్య, పరమేశ్వర్,సూర్యనారాయణలు పాల్గొన్నారు.


మాడ్గుల : ఆర్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలి


సేవాలాల్ జయంత్యుత్సవాల్లో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

కేశంపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సంత్ సేవాలాల్ చూపిన మార్గంలో ప్రజలందరూ నడవాలని మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. కేశంపేట మండలం దేవునిగుడి తండాలో శనివారం రాత్రి నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలకు ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ తన బోధనలతో గిరిజనులకు ఆరాధ్య దైవంగా మారారని తెలిపారు. మాజీ సర్పంచ్‌లు విష్ణువర్ధన్ రెడ్డి, అంజనేయులు, శేఖర్ పంతులు, బీఆర్ఎస్ నాయకులు బుర్రి భూపాల్‌రెడ్డి, ప్రకాశ్, జగన్, శ్రీకాంత్, బద్రునాయక్, హన్మంత్, కిషన్ నాయక్, శ్రీరామ్, బాలునాయక్, బుజ్జి, మోత్య, ఉమ్లా, శంకర్ నాయక్, రవి, శివాచారి తదితరులున్నారు.

నల్లవెల్లిలో బంజారాల ర్యాలీ


నల్లవెల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు, గ్రామస్తులు

యాచారం : సంత్‌సేవాలాల్ జయంతి సందర్భంగా శనివారం రాత్రి మండలంలోని నల్లవెల్లి, నల్లవెల్లి తండా గ్రామాలలో గిరిజనులు భారీ ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు నల్లవెల్లి తండాలో సంత్‌సేవాలాల్‌కు గిరిజనులతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. బంజారా ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్‌ను పూజిస్తే తమ కష్టాలు తీరుతాయని ఈ సందర్భంగా గిరిజనులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమావత్ రమేష్, అంబోత్ నరే ష్, కుమార్, సబావత్ నరేష్, భీమ్‌లాల్, జాటోత్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ సేల్స్ ఢమాల్!

(5వ పేజీ తరువాయి)

వంద రూపాయలు పెంచేశారు. గతంలో కిలో మటన్ రేటు రూ.750 ఉండేది. ప్రస్తుతం రూ.850కు పెంచి అమ్ముతున్నారు. ముక్కలేనిదే ముద్ద దిగనివారు పైసలు ఎక్కువైనా పర్లేదని మటన్ కొనుగోలు చేస్తున్నారు.

చేపలదీ అదే పరిస్థితి

చేపలకు కూడా గిరాకీ పెరిగింది. మాల్, నల్లవెల్లి తదితర గ్రామాల మత్స్యకారులు నాగార్జున సాగర్, హాలియా ప్రాంతాల నుంచి చేపలను తెచ్చి మాల్, యాచారంలలో జోరుగా విక్రయిస్తున్నారు. అయితే, డిమాండ్‌ను బట్టి వ్యాపారులు చేపల రేటును కూడా పెంచారు. బొచ్చ (బతికి ఉన్నది) కిలో రూ.200, బొచ్చ (చనిపోయినది)కు కిలో రూ.170, రవులు (బతికి ఉన్నది) కిలో రూ.200, కొర్రమీను (బతికి ఉన్నది) కిలో రూ.400లకు విక్రయిస్తున్నారు. అయితే, ఈ ధరలు గతంలో దాదాపు రూ.30 తక్కువగా ఉండేవి.

వ్యాపారం బాగా తగ్గింది



కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకుతుందనే వదంతుల కారణంగా చికెన్ విక్రయాలు తగ్గిపోయాయి. గతంలో రోజుకు 50కిలోల చికెన్ అమ్మేవాళ్లం. ప్రస్తుతం 15 కిలోలు కూడా అమ్ముడవుతలేదు. మున్ముందు ఇలాగే ఉంటే కష్టమే. వైరస్ వ్యాప్తి ప్రచారం నమ్మొద్దని వైద్యులు చెబుతున్నారు. బాగా ఉడకబెట్టిన చికెన్, గుడ్లు తినొచ్చని చెబుతున్నారు.

- రామకృష్ణ, మాల్ చికెన్ సెంటర్ నిర్వాహకుడు

బర్డ్‌ఫ్లూ వ్యాధి వదంతి మాత్రమే



జిల్లాలో బర్డ్‌ఫ్లూ అనేది ఎక్కడా లేదు. కోళ్లకు ఈ వైరస్ సోకినట్లు మాకు ఎలాంటి సమాచారం లేదు. వంద డిగ్రీల వేడిలో చికెన్ ఉడికించి తింటే శరీరానికి చాలా మంచిది. గుడ్లు కూడా ఉడకబెట్టి తింటే ఏ ఇబ్బంది ఉండదు. బర్డ్‌ఫ్లూ ప్రచారానికి భయపడాల్సిన అవసరం లేదు.

- డాక్టర్ రేఖ, యాచారం మండల పశువైద్యాధికారి

కొమరబండ వాగుపై బ్రిడ్జి నిర్మాణమెప్పుడో?

● గ్రామస్తుల ఇబ్బందులు.. దూరభారం తగ్గించాలని వేడుకోలు
● పట్టించుకోని పాలకులు, అధికారులు


కొమరబండ వాగులో నుంచి ఏర్పడిన దారి

షాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమరబండ వాగుపై బ్రిడ్జి నిర్మించి ప్రజలకు దూర భారం తగ్గిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు వాగ్దానాలు చేసినా.. నెరవేర్చడం లేదు. వారి మాటలన్నీ నీటిమూటలు గానే మిగిలిపోయాయి. వాగుపై బ్రిడ్జి వస్తే సమస్యలు తీరుతాయని భావించిన ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు, రైతుల ఆశలు అడియాసలవుతున్నాయి. ఎన్ని నిధులైనా ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పిన వారి మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. ఏళ్లనుంచి ఎదురుచూస్తున్నామని, వంతెన నిర్మాణం జరుగుతుందా? అని ప్రజలు వాపోతున్నారు. రేగడిదోస్వాడ, మక్తగూడ, తిర్మలాపూర్, గ్రామాల ప్రజలే కాకుండా పూడూరు మండలం మిట్టకంకల్, కడుమూర్, తదితర గ్రామాల ప్రజలు ప్రతీరోజు షాబాద్‌కు వస్తూపోతూ ఉంటారు. వర్షాలు కురిసినప్పుడు వెళ్లాలంటే నాగర్‌గూడ నుంచి తిరిగి వెళ్లాల్సిందే. కొమరబండ గ్రామస్థులు సైతం వారి పంట పొలాల్లోకి వెళ్లేందుకు వంతెన లేక ఇబ్బందులు పడుతున్నారు. కొమరబండకు చెందిన విద్యార్థులు రేగడిదోస్వాడలోని ఉన్నత పాఠశాలకు వెళ్తుంటారు. వర్షాకాలం విద్యార్థులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి లేక ఇబ్బందులు పడుతున్నాం



గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. కొమరబండ గ్రామస్తుల పొలాలన్నీ వాగు అవతల ఉండటంతో వర్షాకాలంలో వాగు దాటాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. వాగుపై బ్రిడ్జిని నిర్మిస్తే గ్రామ రైతులతో పాటు పదూళ్ల పెట్టు ప్రజలకు దూరభారం తప్పుతుంది.

- సుభాష్‌చంద్రబోస్, కొమరబండ

శుభాకాంక్షల వెల్లువ



ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డా.జి. సంజీవరెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం నగరంలో నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ మహేశ్వరం మండల కార్మిక శాఖ అధ్యక్షుడు నడికూడ శివ హాజరై సంజీవరెడ్డికి పూలగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు రోహిత్, కార్తీక్, శ్రీధర్, గణేష్, యాదయ్య తదితరులు ఉన్నారు.

- మహేశ్వరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి)

108వ రోజుకు చేరిన రిలే దీక్షలు


రిలే దీక్షలో జేఏసీ నాయకులు, గ్రామస్తులు

తలకొండపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 108 రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈమేరకు దీక్షలకు మద్దతుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 9 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, అంజనేయులు గౌడ్, కార్యదర్శి అనిల్‌లు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసే 11 మండలాల జాబితాలో గట్టిప్పలపల్లిని తప్పకుండా చేర్చాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. కాగా, ఈ విషయంలో పాలక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని అన్నారు. లేనియెడల ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. దీక్షల్లో నాయకులు, గ్రామస్థులు తదితరులున్నారు.